స్కెచ్

# ఫాయిదాగల వాయిదా

"హితశ్రీ"

'సాయంత్రం త్వరగా రావాలి సుమండీ.'

'ఏం కథ?'

'బజారుకు వెళ్ళాలి'

'ఎందుకు?'

'చీరెలావీ తేవొద్దూ?'

'తీరదు.'

'రావాలనుకుంటే బాగానే తీరుతుంది.'

'అయితే నే నబద్ధం చెబుతున్నాననా నీ ఉద్దేశం?'

'అని ఎవరన్నారు?' శ్రీదేవి చిన్నబుచ్చుకుంది.

మార్గంలో శివరామారావు కూడా బాధపడక పోలేదు. ఏం చేస్తాడు - ఏ రోజు కారోజు ఆఫీసు పని పెరిగిపోతూనే ఉంది. అదికాక ఆరు గంటలకి టెన్నిస్ నుంచి వచ్చి తంగున ఎనిమిది కొట్టేదాకా కదలడాయెను ఆఫీసరు. అయినా తను, 'ఇవాళ కుదిరేటట్టు లేదు శ్రీ; ఐనా సాధ్యమైనంతవరకు ప్రయత్నిస్తాను.' అని ఉంటే బాగుండేది. అసలు ఇవన్నీ ఆలోచించటానికి 'టైం' ఏది? అప్పుడే తొమ్మిదిన్నర దాటుతోంది. లాండ్రీలో బట్టలు తేవాలి. చేతి గడియారం రిపేరుకి ఇవ్వాలి. ఇంకా ఎన్నో కలకు మించిన పనులు.——

'రోజూ 'రేపు', 'రేపు' అంటే ఎలాగయ్యా, నాలుగు రోజులనుంచి తిప్పుతున్నావు. ఎప్పుటి కిస్తావో ఖచ్చితంగా చెప్పు.'

చికాకు పరచే ఆలోచనలతో అడుగులు వేస్తున్న శివరామారావు తల ఎత్తి చూచి వెనకకి తిరిగాడు లాండ్రీ వైపుగా.

'రేపు తప్పకుండా ఇస్తానులెండి - నేను మాత్రం ఊరికే కూకున్నానా, చూస్తానే ఉంటిరిగా. రండి, రండి బాబుగారూ - యేమన్నా గుడ్డలున్నా యేంటి?'

'అవునోయ్' శివరావు గుడ్డలసంచీ అందించాడు. చుట్టూ మేటలు గుడ్డ లున్నయ్.

'ఎప్పటి కిస్తావు?'

'ఎప్పుడోనా, రేపీపాటికి రండి.' అప్రయత్నంగా అన్నాడు లాండ్రీ యజమాని. శివరామారావుకి ఆశ్చర్యం వేసింది. ఎప్పుడో వేసిన గుడ్డలు ఆరోజుదాకా ఇవ్వలేదని ఇంతకుముందే కదా ఘర్షణ జరిగింది. తన గుడ్డలు రేపే ఎలా ఇవ్వగలడు?

'ఏంపయ్యా, రేపే ఇస్తనన్నావేంటి ఈ గుడ్డలన్నీ. ఇస్త్రీ సేయాల్సిన గుడ్డలు ఇన్నుంటే ఇయన్నీ యాడవుతయా—?'

'రేపటిసంగతి రేపు. రేపు ఈళ్లేదంటే గుడ్డలు ఏసునో ఎయ్యకపోనో—ఇచ్చే గుడ్డలు ఎందు కొదులుకోవాలి—?'

పక్కకొట్లో సిగరెట్లుకొంటున్న శివరామారావు నవ్వుకున్నాడు ఆమాటలు విని. పదవుతోంది! గబగబా నడుస్తున్నాడు అతడు. ఎదురుగా మాధవరావు వొస్తున్నాడు. ఈ మాధవరావు తనదగ్గర పాతికరూపాయలు అప్పు తీసుకుని సంవత్సరం దాటింది.

'ఏమోయ్, మాధవరావ్! కులాసా, ఎక్కడా కనపట్టమే లేదు?'

'ఏదోయ్, బొత్తిగా తీరిక దొరక్కుండా ఉంది— అన్నట్టు— నీకో పాతికరూపాయలు ఇవ్వాలికాబోలు— జ్ఞాపకం ఉండటంలేదోయ్. రేపు తప్పకుండా ఇస్తాను. ఇంటిదగ్గరే ఉంటావు కదూ?' తుర్రుమన్నాడు.

ఇలాంటి రేపులు చాలా గడిచాయి. అయినా శివరామారావుకి కాస్త తృప్తిగానే ఉంది. రేపటిదాకా ఆశ ఉంటుంది. రేపు దాటిన తర్వాత కదా పాతికరూపాయల విషయం మళ్ళీ ఆలోచనలోకి వచ్చేది!——

'సుబ్బారావుగారూ, ఈ గడియారం నమ్మి కట్టింది. దీని విషయం కాస్త చూడండి.'

'ఓ, అలాగే.'

'ఎప్పుడు రాను మళ్ళీ?'

'రేపే.'

'రేపేనా?' అన్నాడు శివరామారావు మేద తీసిన గడియారాలవైపు చూస్తూ.

'అవును,' సుబ్బారావుగారి పెదవులమీద చిరునవ్వు చిందులాడింది.

శివరామారావు ముందుకు సాగాడు. తన ముందు ఇద్దరు విద్యార్థులు మాట్లాడుకుంటూ పోతున్నారు.

'సాయంత్రం సినిమాకి వెళ్దామా?'

'ఓ. ఎంత తిరిగినా, ఎక్కడికి వెళ్ళినా ఇవాళ ఒక్కరోజే.'

'అదేం?'

'రేపట్నుంచీ నేను తీవ్రంగా చదవ దలుచుకున్నాను.'

'ఓహో, అదా. మొన్నటినుంచీ తీవ్రంగాచదవడం ప్రారంభిస్తానన్నట్టున్నావు.'

'అవును. కొన్ని ఇబ్బందులవల్ల అది సాధ్యం కాలేదు. ఏమైనా రేపట్నుంచీ తప్పదు.'ఘంటాపథంగా అనేసి తృప్తిపడ్డాడు, తాత్కాలికంగా.

శివరామారావు అనుకోకుండా గట్టిగా నవ్వాడు. ఆ కుర్రాళ్ళిద్దరూ తనవైపు చూడడం చూసి తప్పిదం గ్రహించి పక్కన నడుస్తున్న అపరిచితుడితో మాట్లాడుతున్నట్టు నటించాడు. 'రేపు' వాయిదాలోని లాభాలూ, సుఖమూ, తృప్తీ అతడికి క్రమంగా అవగతమవుతూన్నాయి.

పోతూ, పోతూ యథాలాపంగా అడిగాడు టైలర్ని.

'ఏమోయ్, అయినాయా?'

ఒచ్చేజవాబు శివరామారావుకి తెలుసు.

''మీ పేనండి కుడుతూంట. రేపు-''

శివరామారావు నవ్వాడు భావగర్భితంగా టైలరువైపు చూసి. టైలరుకూడా నవ్వకుండా ఉండలేకపోయాడు.

శివరామారావు ఆలోచిస్తూ ఆఫీసువైపు నడకసాగించాడు. ఇందాక తను ఎంత పొరపాటు చేశాడు. త్వరగా రమ్మని శ్రీదేవి అన్నప్పుడు, తను కొంచెం ఆలోచించినట్టుగా నటించి తప్పనిసరిగా అన్నట్టు ''ఇవాళ తీరిక ఉండదేమో శ్రీ-నిన్న చెప్తే ఎంతబాగుండేది. పోనీలే- రేపు తప్పకుండా వెళ్దాం.'' అని ఫీలవుతున్నట్టుగా చెప్పి ఉంటే ఆమె ఎంత సంతోషించి ఉండేది.

''ఈ కాస్తపని చేయటానికి మూడు రోజులు కావాలా? ఏమైనాసరే ఈ పని నాకు రేపటిలోపల పూర్తిచేసి చూపించాలి.'' అరుస్తున్నాడు- ఆఫీసరు పెద్ద గుమాస్తాతో. శివరామారావు గప్‌చిప్‌గా వెళ్ళి తన స్థానం ఆక్రమించుకున్నాడు. బల్లమీద మేరుపర్వతంతో పోటీచేస్తున్న ఫైల్సు ఉన్నాయి.

''వీటికి—జీవనది ప్రవాహం, అంతెక్కడ-'' అనుకున్నాడు శివరామారావు.

''చూడండి, శివరామారావుగారూ'' ఆఫీసరు అన్నాడు అతడి బల్లదగ్గరగా వచ్చి. శివరామారావు నిలబడ్డాడు.

''ఇవన్నీ చాలా అత్యవసరమయిన కాగితాలు. వీటికి సంబంధించిన పని త్వరగా పూర్తి చేయాలి.''

''అలాగేనండి.''

'ఎప్పటిలో పూర్తి అవుతుంది?'

శివరామారావు ఫైల్స్ వైపు చూశాడు దిగాలుగా.

''ఏం, ఎప్పుడు పూర్తి చేస్తారు ఈ పని?'

దిక్కులు చూస్తున్న శివరామారావుకి చటుక్కున ఓ భావకిరణం మెరిసి నట్టయింది

'రేపే' ధీమాగా, నిస్సంకోచంగా అన్నాడు పెదవుల్లోంచి బయటికి వస్తున్న చిరునవ్వును బలవంతాన వెనక్కి నెట్టుతూ. 'భేష్. పనిమీద ఆసక్తి అంటే అలా ఉండాలి!' శివరామారావు భుజం తట్టి వెళ్ళిపోయాడు ఆఫీసరు, తృప్తిని సూచిస్తూ. పెద్దగుమాస్తా బిత్తరపోయి చూశాడు.